సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 21 | ఆగస్టు | 2025



రూ.1,16,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నెక్కంటి గోపాలకృష్ణ, అన్నపూర్ణ, విశాలాక్షి, వేంకట సురేంద్ర, శ్రీవిద్య (అంగర, కపిలేశ్వరపురం) రూ.1,16,116 విరాళాన్ని బుధవారం అందజేశారు.



విజ్ఞానపదం

సంస్కృతి, సంప్రదాయాలు, విజ్ఞానాన్ని ఒక తరం నుంచి మరో తరానికి అందించడంలో జానపద కళలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయి.

-8లో..

కక్ష కట్టి.. కడతేర్చి..



భార్యను కాపురానికి పంపడం లేదని అత్తమామలపై కక్ష కట్టిన అల్లుడు.. చాకుతో వారిద్దరినీ దారుణంగా పొడిచి చంపాడు.

-8లో..

న్యూస్‌రీల్

తాత్కాలిక ధ్రువపత్రం ఉన్నవారి పెన్షన్లు ఆపలేదు

రాజమహేంద్రవరం సిటీ: మానసిక వికలాంగత్వం (ఎమ్.ఆర్), మానసిక అనారోగ్యం (ఎమ్.ఐ) కేటగిరీల కింద తాత్కాలిక వైద్య ధ్రువపత్రం జారీ చేసిన వారికి ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్లు నిలుపుదల కావని, ఎలాంటి నోటీసులు కూడా జారీ చేయబోమని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ జిల్లాలో 4,328 మంది ఈ రెండు కేటగిరీల కింద పెన్షన్లు పొందుతున్నారన్నారు. వారిలో 1,402 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, అందులో 477 మందికి నోటీసులు జారీ చేశారన్నారు. ఎమ్ఆర్ కేటగిరీలో 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన 256 మందికి తాత్కాలిక వైద్య ధ్రువపత్రం జారీ చేశామన్నారు. ఎమ్ఐ కేటగిరీలో 1,157 మందిలో 429 మందికి పరీక్షలు జరగగా, అందులో పెన్షన్ నిలిపివేసిన 206 మందిలో 204 మంది 18 ఏళ్ల లోపు వారే ఉన్నారన్నారు. వారికి తాత్కాలిక ధ్రువపత్రం జారీ చేశామని వివరించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: పదవ తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ ఫెయిలైన అభ్యర్థులకు జిల్లాలో గల ప్రభుత్వ ఐటీఐలలో 2025–26 సంవత్సరానికి మూడవ విడత అడ్మిషన్స్‌కు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ సీహెచ్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఐటిఐ.ఏపీ.జీవోవి.ఐన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక జత జిరాక్స్ కాపీలతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 79813 08986, 78010 95303 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

రేపు సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం



అన్నవరం: శ్రావణమాసం ఐదో శుక్రవారం సందర్భంగా సత్యదేవుని సన్నిధిన 'సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం' నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు ఈ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. నిత్య కల్యాణ మండపంతోపాటు నాలుగు, ఐదో నంబర్ వ్రత మండపాలలో కూడా ఈ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మూడు మండపాలలో వ్రతాలు నిర్వహించిన తరువాత కూడా మహిళలు ఎక్కువగా ఉంటే ఉదయం పది గంటలకు రెండో బ్యాచ్‌లో కూడా ఈ వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగులను ఏడిపింఛన్!

- అనర్హత పేరుతో దివ్యాంగుల పెన్షన్లకు భారీగా కోత
- వైకల్య ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని వెల్లడి
- అందుకు అనుగుణంగా ఏర్పాటు చేయని సదరం క్యాంపులు
- తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 33,688 మందికి పెన్షన్లు
- 19,928 మంది వైకల్య శాతం తిరిగి పరిశీలన
- గగ్గోలు పెడుతున్న దివ్యాంగులు

చిత్రంలో మంచానికే పరిమితమైన వ్యక్తి పేరు పేకేటి సత్యనారాయణ. నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెం గ్రామంలో నివాసముంటున్నారు. ఈయన పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నారు. ఏ పనీ చేసుకోలేని పరిస్థితి. కేవలం మంచానికే పరిమితమయ్యారు. భార్య సహాయం చేస్తే తప్ప తనపని తాను చేసుకోలేని దుస్థితి. అలాంటి వ్యక్తిపై సైతం కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదు. 85 శాతం వైకల్యం ఉండాలని.. రీ వెరిఫికేషన్‌లో 59 శాతం వైకల్యం మాత్రమే ఉందని నోటీసు ఇచ్చారు. అనర్హత పేరుతో పింఛను పీకేశారు. కళ్లముందు వ్యక్తి మంచంపై ఉంటే.. వైకల్యం లేదనడం ఎంతవరకూ సమంజసం. దీంతో ఆ దివ్యాంగుడు లబోదిబో మంటున్నారు. తాను, భార్య ఉంటున్నామని, తన కుటుంబానికి ఆసరాగా ఉన్న పింఛన్ తొలిగిస్తే కుటుంబ పోషణ ఎలాగంటూ ఆవేదన చెందుతున్నారు. కేవలం ఇతనొక్కరే కాదు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దివ్యాంగుల పరిస్థితి ఇలాగే ఉంది.



వైకల్య శాతం లేదంటూ అధికారులు ఇచ్చిన నోటీసు చూపుతున్న పేకేటి సత్యనారాయణ భార్య

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజలపైనే కాదు.. దివ్యాంగులపై కూడా కూటమి ప్రభుత్వానికి కనికరం కరువైంది. అనర్హత పేరుతో అడ్డగోలుగా పింఛన్లు తొలగిస్తోంది. ఉన్న ఆసరాను దూరం చేస్తోంది. కేవలం మంచానికే పరిమితమైనా.. అనర్హత కారణంగా చూపి వారి నోటికాడ కూడును లాగేస్తోంది. సరికొత్త నిబంధనలు తెరపైకి తీసుకొచ్చి పింఛన్లలో కొర్రీలు పెడుతోంది. మీ వైకల్య అర్హతను నిరూపించుకోవాలని మరి కొంత మందికి నోటీసులు అందిస్తోంది. రూ.15 వేలు పొందుతున్న పింఛను రూ.6 వేలకు తగ్గిస్తోంది. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్న వారి పింఛన్లు మార్పుచేస్తూ తీరని వేదన మిగులుస్తోంది. కూటమి ప్రభుత్వ చర్యలతో దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్న ఆర్థిక ఆసరాను లాగేస్తే తామెలా బతకాలంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. అయినా ప్రభుత్వం కనికరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పింఛన్లు భారీగా తగ్గించుకునేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

జిల్లాలో 3,211 పింఛన్ల తొలగింపు

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అధికారిక లెక్కల మేరకు 33,688 మంది దివ్యాంగ కేటగిరిలో ప్రతి నెలా పింఛన్లు పొందుతున్నారు. వారిలో 1,321 మంది వివిధ రకాల హెల్త్ పింఛన్లు (రూ.15 వేలు) తీసుకుంటున్నారు. మిగిలిన 32,367 మంది రూ.6 వేల పింఛను పొందుతున్నారు. పింఛన్ల తొలగింపులో భాగంగా 19,928 మందికి సంబంధించిన వైకల్య శాతం తిరిగి పరిశీలించారు. వారిలో 3,211 మందికి ప్రభుత్వ నిబంధనల మేరకు వైలక్య శాతం లేదని నిర్ధారించారు. వీరిని అనర్హులుగా గుర్తించి పింఛన్లు రద్దు చేసినట్లు ఆయా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నోటీసులు అందించారు.



మంచానికే పరిమితమైన పేకేటి సత్యనారాయణ

పింఛను సొమ్ము తగ్గింపు

కూటమి ప్రభుత్వం ఆదాయ ఆర్జనలో భాగంగా పింఛను సొమ్మును సైతం తగ్గిస్తోంది. ఇందులో భాగంగానే రూ.15 వేలు పింఛను పొందుతున్న 398 మందిని వివిధ కారణాలతో దివ్యాంగ పింఛన్ల (రూ.6 వేల)కు మార్చింది. తొమ్మిది మందిని వృద్ధాప్య పింఛన్ల (రూ.4 వేలు)కు కుదించారు. రూ.6 వేలు దివ్యాంగ పింఛన్లు పొందుతున్న కోటాలో 18,609 మందికి రీ వెరిఫికేషన్ చేపట్టారు. 405 మందికి వృద్ధాప్య పింఛన్లుగా మార్చారు. 3,211 మందిని అనర్హులుగా గుర్తించి వారికి పింఛన్లు తీసేశారు.

తొలగిస్తున్నారిలా..

దివ్యాంగ పింఛనుకు మీరు అనర్హులంటూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నోటీసులు ఇస్తున్నారు. సదరం సర్టిఫికెట్ల జారీ 2009–2010లో ప్రారంభమైంది. ఆ సమయంలో 100 శాతం వికలత్వం ఉంటే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ–వెరిఫికేషన్‌లో 40 శాతానికి తగ్గిపోతోంది. అదెలా తగ్గుతోందో అంతుచిక్కని ప్రశ్నగా మారుతోంది. ఫలితంగా దివ్యాంగులు పింఛను కోల్పోతున్నారు. గతంలో వెరిపై చేసి వైకల్య ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇచ్చింది వైద్యులే. అప్పుడు 85, 90, 100 శాతం వికలత్వం ఉంటే.. ఇప్పుడు 40 శాతం లోపు ఎలా తగ్గుతోందంటూ బాధితులు వాపోతున్నారు.

చాపకింద నీరులా తొలగింపు ప్రక్రియ

దివ్యాంగ పింఛన్ల తొలగింపు ప్రక్రియ చాపకింద నీరులా సాగుతోంది. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నోటీసులు ఇస్తున్నారు. నోటీసులు అందుకున్న వారిలో ఎక్కువ శాతం మందికి పింఛనుకు అనర్హత ఉన్నట్లు తేలుతోంది. తమ పింఛను పోతుందని భావిస్తున్న లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో కలెక్టరేట్, ఎంపీడీఓల వద్దకు పరుగులు తీస్తున్నారు. అనధికార సమాచారం మేరకు జిల్లాలో ఎనిమిది వేలకు పైగా పింఛన్లు తొలగించినట్లు తెలిసింది. ఈ నెల 27వ తేదీ వరకు సదరం రీ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, నోటీసులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. తొలగింపులకు గురైన వారిలో చెవిటి, మూగ, శారీరక వికలాంగులు, అంధులే అధికంగా ఉంటున్నారు.

తొలగింపులు కుట్రలో భాగమే..!

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గద్దెనెక్కాలన్న తలంపుతో చంద్రబాబు సంక్షేమ పథకాలు, పింఛన్లపై అమలుకు సాధ్యంకాని ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చాక కోతలు ప్రారంభించారు. దివ్యాంగులపై కనీస కనికరం లేకుండా పింఛన్ల తొలగింపులకు నాంది పలికారు. ఇదంతా పింఛన్లు తగ్గించుకునేందుకు ఆడుతున్న నాటకంలో భాగమే అన్న ఆరోపణలున్నాయి.

సిఫారసులకే అందలం

దివ్యాంగుల పింఛన్ల తొలగింపులు, సదరం రీ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల జారీలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే సిఫారుసులకే పెద్దపీట వేస్తున్నారు. ప్రజా ప్రతినిధుల అండదండలు ఉన్న వారికే ఇస్తున్నారు. వైకల్యం లేకపోయినా.. ఉన్నట్లు ధ్రువీకరిస్తూ పింఛన్లు కొనసాగిస్తున్నారు. సిఫారసు లేనివారికి మాత్రం నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. సిఫారసులు ఉన్న వారికి రూ.15 వేల పింఛన్లు వచ్చే విధంగా 85 నుంచి 100 శాతం వరకు వికలత్వం నమోదు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మిగిలిన వారికి మాత్రం తొలగించేస్తున్నారు. మరి కొంత మంది సదరం క్యాంపులో మామూళ్లు ముట్టజెప్పి వైకల్య శాతం నమోదు చేయించుకుంటున్నారు. పైసలు ఇవ్వలేని వాళ్లు మాత్రం ఏమీ చేయలేక వెనుదిరగాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.



పేకేటి సత్యనారాయణకు సచివాలయ ఉద్యోగులు ఇచ్చిన నోటీసు

వాడపల్లి వెంకన్నకు రూ.1.42 కోట్ల ఆదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి హుండీల ద్వారా రూ. 1,42,16,807 ఆదాయం వచ్చింది. దేవదాయ, ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు బుధవారం ఈ విషయం తెలిపారు. ఆలయంలోని హుండీలను 28 రోజుల అనంతరం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బుధవారం తెరిచి, ఆదాయాన్ని వసంత మండపంలో లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.1,19,58,204, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ. 22,58,603 వచ్చిందని ఈఓ వివరించారు. అలాగే బంగారం 23 గ్రాములు, వెండి 670 గ్రాములు, విదేశీ కరెన్సీ నోట్లు 46 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణ అధికారిగా ఏసీ అండ్ జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ సార్ ప్రసాద్, జిల్లా దేవదాయశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు డి.సతీష్ కుమా ర్, గోపాలపురం గ్రూపు దేవాలయాల ఈవో బి కిరణ్, దేవస్థానం సిబ్బంది అర్చకులు, శ్రీవారి సేవకులు పోలీసులు, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఆక్టోపస్ మాక్ డ్రిల్



సెంట్రల్ జైలులో మాక్ డ్రిల్ నిర్వహించిన ఆక్టోపస్ బృందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కేంద్ర కారాగారంలో ఆపరేషన్ మహా సురక్ష పేరుతో ఆక్టోపస్ టీమ్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఆ వివరాలను జైలు సూపరిడెంట్ ఎస్.రాహుల్ బుధవారం తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో రెవెన్యూ, ఫైర్, మెడికల్, ఎలక్ట్రికల్ విభాగాల సిబ్బంది, లోకల్ పోలీస్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్‌లు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. జైలులో అత్యవసర పరిస్థితులు ఎదురై, అనుకోని ఘటనలు జరిగినప్పుడు, ఉగ్రవాద చర్యలు, ప్రమాదకర ఘటనలు ఎదురైనప్పుడు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడం మాక్ డ్రిల్ ముఖ్యోద్దేశం. రక్షణ వ్యవస్థలను సమర్థంగా వినియోగించి ప్రతిస్పందించడమే ధ్యేయంగా దీన్ని నిర్వహించారు. అత్యవసర పరిస్థితులలో సురక్షిత చర్యలు చేపట్టడానికి అవసరమైన మార్గదర్శకాలను జైలు అధికారులకు, సిబ్బందికి ఆక్టోపస్ బృందం వివరించింది. మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ అధికారులు, డీఎస్పీలు బి.కృష్ణ, కె.శంకరయ్య, ఇన్‌స్పెక్టర్ బి.మురళీ, ఆక్టోపస్ సిబ్బంది, జైలర్లు, డిప్యూటీ జైలరు పాల్గొన్నారు.

25న ఎస్ఎఫ్ఐ చలో కలెక్టరేట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 25న కలెక్టరేట్ ముట్టడించనున్నట్లు, దీనికి పెద్ద ఎత్తున విద్యార్థి లోకం కదిలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ చలో కలెక్టరేట్ పోస్టర్‌ని బుధవారం ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో చలో కలెక్టరేట్ జరుగుతుందని, ప్రధానంగా పెండింగులో ఉన్న రూ.3,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, జీఓ నెం. 77 రద్దు చేసి పీ.జీ. చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని, యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలనే ప్రధాన డిమాండ్స్‌తో చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కె.జ్యోతి, ఉపాధ్యక్షులు ఎస్.కనక, కార్తిక్, తేజ, ఆదిత్య, షన్ను పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు వద్ద మహిళల తోపులాట

అనపర్తిలో యుద్ధ వాతావరణాన్ని తలపించిన ఉచిత బస్సు ప్రయాణం



బస్సు ఎక్కడానికి నెట్టుకుంటున్న మహిళలు

అనపర్తి : ప్రచార ఆర్భాటంతో అరకొర బస్సులతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన స్త్రీ శక్తి (స్త్రీలకు ఉచిత బస్సు) పథకం ప్రారంభించి నాలుగు రోజులు గడవకుండానే మహిళల సహనానికి పరీక్షగా నిలిచింది. మంగళవారం అనపర్తి బస్టాండ్‌లో జరిగిన ఘటన ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే సాయంత్రం నాలుగు గంటల సమయంలో కళాశాలల నుంచి, వ్యాపార, షాపింగ్ తదితర పనులు ముగించుకుని వారి గమ్యస్థానాలకు బయలుదేరిన మహిళలు పెద్ద ఎత్తున అనపర్తి బస్టాండ్‌లో వేచి ఉన్నారు. ఇంతలో ఒక బస్సు వచ్చి బస్టాండ్‌లో నిలిచింది. దీంతో మహిళలంతా ఒక్కసారిగా పెద్ద ఎత్తున కేకలు వేస్తూ నెట్టుకుంటూ బస్సు ఎక్కడానికి చేసిన ప్రయత్నం రణరంగాన్ని తలపించింది. జనం ఎక్కువగా ఉండడంతో ముందుగా బస్సు ఎక్కాలన్న ఆతృతలో బస్సు ఆగకుండానే ఎక్కడానికి ప్రయత్నించిన ఒక మహిళ జారి పడి బస్సు కిందదికి వెళ్లిపోవడంతో ప్రయాణికులు అప్రమత్తమై పెద్దగా కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును నిలిపివేశారు. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇదిలా ఉంటే స్త్రీ శక్తి పథకాన్నైతే ఆడంబరంగా ప్రకటించారు కాని అవసరమైనన్ని బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. సాధారణ సమయంలో చక్కగా ప్రయాణాలు సాగేవని ఈ పథకం ప్రవేశపెట్టాక సమయానికి బస్సులు రాక, పనులు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉగ్ర గోదావరి ఉరకలు



కాటన్ బ్యారేజీ నుంచి విడుదలవుతున్న మిగులు జలాలు

- నేడు ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం
- ఇరిగేషన్ యంత్రాంగం అప్రమత్తం
- కాటన్ బ్యారేజీ నుంచి 8.28లక్షల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: ఉగ్ర గోదావరి ఉరకలేస్తోంది. ఎగువ నుంచి కాటన్ బ్యారేజీకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇరిగేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నీటి ఉధృతి వేగంగా పెరుగుతుంది. మరోపక్క గోదావరి ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి పొంగి పొర్లుతున్నాయి. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద బుధవారం రాత్రి 10.60 అడుగులకు నీటి మట్టం చేరింది. మొత్తం 175 క్రస్ట్‌గేట్లను పూర్తిగా పైకిలేపి మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. 8,28,331 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. డెల్టా కాలువలకు సంబంధించి 4,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,000 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1,300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

నేడు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి..

కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి క్రమక్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం ఉదయం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటి మట్టం చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ యంత్రాంగం అంచనా వేస్తోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల చేస్తూ 11.75 అడుగులకు నీటి మట్టం చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటిస్తారు. 13.75 అడుగులకు నీటి మట్టం చేరితే రెండవ ప్రమాద హెచ్చరికను ,17.75 అడుగులకు నీటి మట్టం చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయితే లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు పడవల రాకపోకలను నిషేధిస్తారు.

ఎగువ ప్రాంతాల్లో ఇలా...

ఎగువ ప్రాంతాలకు సంబంధించి భద్రాచలంలో 47.40 అడుగులకు నీటి మట్టం చేరింది. భద్రాచలంలో ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. కాళేశ్వరంలో 12.83 మీటర్లు, పేరూరులో 17.48మీటర్లు ,దుమ్ముగూడెంలో 13.07మీటర్లు, కూనవరంలో 18.14మీటర్లు, కుంటలో 9.75మీటర్లు, పోలవరంలో 13.78 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.55 మీటర్ల వద్ద నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

మౌలిక వసతులు



అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సహాయక చర్యల్లో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని కేతావారి లంక, వెదుర్లంక, బ్రిడ్జి లంక మొదలగు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుమారు 198 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాం. వారికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాం. రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

– ఆర్. కృష్ణనాయక్, ఆర్డీఓ, రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరంలో వరద గోదావరి ఉధృతి



భోజనాల కోసం క్యూలో నిలుచున్న లంక ప్రజలు



ఆల్కాట్ గార్డెన్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్ తదితరులు

లంకలను ముంచెత్తిన వరద

- 198 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు
- జలదిగ్బంధంలో కేతావారి లంక, వెదుర్లంక, బ్రిడ్జి లంక
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లంక ప్రాంతాల్లో నివసిస్తున్న వారు వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తారు. వర్షాకాలం మూడు నెలలు వీరికి కష్ట కాలం అని చెప్పవచ్చు. చేపలు పట్టుకోవడం, లంకల్లో పశువుల పెంపకం వంటి పనులతో వీరంతా జీవనోపాధి పొందుతారు. వర్షాకాలంలో గోదావరికి వరద నీరు చేరడంతో వీరిని పునరావాస కేంద్రాలకు తరలించడం పరిపాటుగా మారింది. ఏటా వర్షాకాలంలో వీరిని రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రాలకు తరలిస్తారు. అక్కడే వీరికి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. వరద ఉధృతి తగ్గిన తరువాత వారంతా తిరిగి లంకల్లోకి వెళ్లతారు.

మగవారు పడవలకు కాపలా...

మహిళలు, పిల్లలు, వృద్ధులు పునరావాస కేంద్రాలకు తరలిరాగా మగవారు మాత్రం పడవలకు కాపలాగా లంకల్లోనే ఉంటారు. పడవలు వరద ఉధృతిలో కొట్టుకుపోకుండా వాటిని కాపాడుతారు. కొంతమంది మగవాళ్లు పునరావస కేంద్రానికి వచ్చి భోజనం చేసి తిరిగి లంకల్లోకి చేరుకుంటారు. అప్పుడు మిగిలిన వాళ్లు పునరావాస కేంద్రానికి వచ్చి భోజనాలు చేస్తారు.

పునరావాస కేంద్రానికి తరలింపు

గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ముందుస్తు చర్యలుగా నదీ పరివాహక ప్రాంతంలోని మూడు లంకల్లో ఉన్న కుటుంబాలకు చెందిన వారిని అధికారులు సురక్షితంగా పునరావాస కేంద్రానికి తరలించారు. మంగళవారం మత్స్య, అగ్నిమాపక, రెవెన్యూ, మునిసిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో మూడు లంక గ్రామాల్లోని కుటుంబాలను తరలించారు. మానవ, పశువుల ప్రాణ నష్టం నివారణ చర్యల్లో భాగంగా వారిని సురక్షితంగా పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. అల్కట్ గార్డెన్, మునిసిపల్ కల్యాణ మండపంలో వీరికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. బ్రిడ్జి లంక, ఎదుర్లమ్మలంక, కేతవారిలంక కు చెందిన సుమారు ఇప్పటి వరకు 198 మందికి పునరావాస కేంద్రంలో చేర్చారు.



లంక ప్రజలను పడవల్లో తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

రాయవరం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఐటీఐల్లో ప్రవేశాలకు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అ సమయంలోనే అభ్యర్థి ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నాడో తప్పనిసరిగా తెలపాలన్నారు. మొదటి, రెండు విడతల్లో సీట్లు రాని అభ్యర్థులు దీనికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అభ్యర్థులందరూ తమ దగ్గరలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఈనెల 27వ తేదీ లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని, అప్రూవల్ పొందాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 29 ఉదయం 9 నుంచి, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 30 ఉదయం 9 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో ఏమైనా సందేహాలు వస్తే 0884 2348182, 94404 08182 నంబర్లను సంప్రదించాలన్నారు.

బంగారు పుస్తెల తాడు చోరీ

రామచంద్రపురం రూరల్: ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి మెడలోని బంగారు పుస్తెల తాడును దొంగ లాక్కుని పరారయ్యాడు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ద్రాక్షారామకు చెందిన తంగిరాల జయ సంతోషి విష్ణు ప్రియ.. వెంకటాయపాలెంలోని లిటిల్ రోజ్ విద్యాసంస్థలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె బుధవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళుతున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం దాటిన తర్వాత ఓ దొంగ మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని ఆరు కాసుల బంగారు పుస్తెల తాడు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞానపదం

- జానపద కళలకు ఎంతో చరిత్ర
- అనాటి సంప్రదాయాలకు ప్రతీక
- నేటికీ కొనసాగుతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో అనేక మంది కళాకారులు
- రేపు అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవం

కపిలేశ్వరపురం: సంస్కృతి, సంప్రదాయాలు, విజ్ఞానాన్ని ఒక తరం నుంచి మరో తరానికి అందించడంలో జానపద కళలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయి. మన పూర్వీకుల ఆచారాలు, పద్ధతులు, ఆనాటి పరిస్థితులకు అద్దం పడతాయి. వీటిలో గీతాలు, నృత్యాలు, నాటకాలు, శిల్పాలు, వాయిద్యాలు.. ఇలా అనేకం ఉంటాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల సంప్రదాయాలను వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జానపద కళారూపాలకు ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం (ఆగస్టు 22) అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవం సందర్భంగా వాటిపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 55 వేల మంది జానపద కళాకారులు ఉన్నారు. గరగ నృత్యం, డప్పు వాయిద్యం, కోలాటం తదితర ఆధ్యాత్మిక కళాకారులు దాదాపు ప్రతి ప్రాంతంలోనూ కనిపిస్తారు. పెద్దాపురం, కాకినాడలో తప్పెటగుళ్ల కళాకారులు, మాధవపట్నం, కొత్తపేటల్లో తోలుబొమ్మల కళాకారులు, పెద్దాపురం తదితర మెట్ట ప్రాంతాల్లో సాము గారడి, ఏజెన్సీ ప్రాంతాల్లో థింసా నృత్య కళాకారులు ఎంతో ప్రసిద్ధి చెందారు. జిల్లా వ్యాప్తంగా దళిత సామాజిక వర్గీయులు గారడీ నృత్యకళను తమ భుజాలపై వేసుకుని పోషిస్తున్నారు. రామచంద్రపురం ప్రాంతంలో బుర్రకథ, కపిలేశ్వరపురం మండలంలో గంగిరెద్దుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, గరగ నృత్యం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

పలు ప్రదర్శనలు

- రాజానగరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యాన ఈ ఏడాది ఫిబ్రవరి 5, 6 తేదీల్లో ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల ఆదివాసీ కళాకారులు నిర్వహించిన జానపద, లంబాడీ, థింసా, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) ఆధ్వర్యాన మూడు రోజుల పాటు 25వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహించగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఆర్‌సీ కృషిని సినీ నటులు తనికెళ్ల భరణి, గౌతం రాజు అభినందించారు. స్వేచ్ఛ, బ్రహ్మ స్వరూపం, జనరల్ బోగీలు అనే నాటకాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.
- రాజమహేంద్రవరం సద్గురు సన్నిధి నిర్వహణలో శ్రీత్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణంలో ఆగస్టు 3న జరిగిన అన్నమయ్య కీర్తనలకు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ శిష్యులు నర్తించిన తీరు ఆకట్టుకుంది.
- రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో ఈ ఏడాది జూన్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన 43వ అంతర్జాతీయ సంగీత నృత్య ఫెస్ట్ – 2025 అలరించింది. శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, భారతీయ యువ సేవా సంఘ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఫెస్ట్‌లో మలేషియా బృందం, 13 రాష్ట్రాల నుంచి 550 మంది కళాకారులు సంగీతం, నృత్య, జానపద కళారూపాలను ప్రదర్శించారు.
- పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ ఆధ్వర్యాన ఈ ఏడాది జనవరి 24న నాటక పోటీలు నిర్వహించారు.
- బిక్కవోలు మండలం కొంకుదురుకు చెందిన సీనియర్ రంగస్థల దర్శకుడు, నటుడు తాడి సూర్యనారాయణరెడ్డి (78) ఈ ఏడాది జూన్ 25న కన్నుమూయడం కళాకారులకు తీరని లోటు. ఆయన వెంకట రమణ ఆర్ట్స్ సంస్థకు ఆస్థాన దర్శకుడిగా ఉంటూ సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి నారాయణరావుతో కలిసి పనిచేశారు.


కపిలేశ్వరపురంలో గరగ నృత్య కళా ప్రదర్శన


అంగరలో కోలాటం ఆడుతున్న మహిళలు

జగన్ ప్రభుత్వం చేయూత

గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజాము ఆరు గంటలకే వలంటీర్లు.. కళాకారులకు ఇంటికెళ్లి పింఛన్ సొమ్ములు అందించేవారు. కరోనా మహమ్మారి సమయంలోనూ కళాకారుల పింఛను చెల్లింపును కొనసాగించారు. రంగస్థల సమాజాలు, పరిషత్‌లకు రూ.5 లక్షలతో వైఎస్సార్ రంగస్థల పురస్కారాలను ఇచ్చేందుకు కృషి జరిగింది. అప్పటి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు అభ్యర్థనపై కందుకూరి వీరేశలింగం జయంతి అయిన ఏప్రిల్ 16ను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక రంగ దినోత్సవంగా ప్రకటించారు.

కళాకారులకు పురస్కారాలు


- విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు నాటక దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ 16న కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామానికి చెందిన నటి సరోజకు మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా పురస్కారం అందజేశారు.
- సాతులూరులో ఈ ఏడాది మే 28న నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల వేదికపై ప్రత్తిపాడుకు చెందిన రంగస్థల మేకప్ కళాకారుడు కాతేటి నూకరాజు (థామస్)కు నటరత్న ఎన్టీఆర్ పురస్కారాన్ని అందజేశారు.
- న్యూఢిల్లీలో జనవరి 26న జరిగిన గణతంత్ర దినోత్సవంలో కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరానికి చెందిన గరగ నృత్య కళాకారుడు కొరివి కల్యాణ్, కొత్తపేట మండలం పలివెలకు చెందిన కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్ తమ కళను ప్రదర్శించారు. మొత్తం గణతంత్ర దినోత్సవాన్ని జాతీయ స్థాయి డాక్యుమెంటరీగా రూపొందించగా, వీరి కళా ప్రదర్శనకు అందులో స్థానం లభించింది. వీరిలో కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్‌కు ఈ ఏడాది ఏప్రిల్ 13న విశాఖపట్నం మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కళాజ్యోతి పురస్కారం దక్కింది. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఒడిసా రాష్ట్రంలోని పూరీలో జరిగిన ఫోక్ ఫైర్ ఫెస్టివల్‌లో కళా ప్రదర్శనను ఇచ్చారు.
- కాకినాడలో ఈ ఏడాది జూలైలో జరిగిన అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ రజతోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహించారు.

శిక్షణ శిబిరం

జానపద కళ పాతకాలం నాటిదే అయినా ఆధునిక కాలానికి అనుగుణంగా కళాకారులు ఎప్పటికప్పుడు శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాది జూన్ 6న అమలాపురంలో ప్రజానాట్యమండలి కళాకారుడు శామ్యూల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. పెద్దాపురం కళాకారుడు యాసలపు సూర్యారావు స్మారక భవన్‌లో ఈ ఏడాది జూన్ 21న కళాకారుల శిక్షణ శిబిరం నిర్వహించారు.


పల్లెసుద్దులు ప్రదర్శనలో పెద్దాపురం కళాకారులు

నిత్య నూతనం



మానవుడు తన అవసరాలను తీర్చుకోవడానికి నిత్యం శ్రమిస్తాడు. ప్రకృతితో పోరాడుతూ ప్రకృతి శక్తులను వినియోగించుకుంటాడు. ప్రకృతితో సావాసమే మానవుని జీవన గమ్యం. ఆ శ్రమ మూలాల నుంచి పుట్టినదే జానపద కళ. ప్రాంతాలను బట్టి రూపాలు మారినా కళ మూలం మాత్రం మానవుని శ్రమే. అందుకే మానవుని ఉనికి ఉన్నంతకాలం జానపదం బతికే ఉంటుంది.

– పి.సురేష్, ప్రజా గాయకుడు, రాజమహేంద్రవరం

కళాకారుల వినతులు

జానపద కళా పోషణ భారాన్ని ప్రభుత్వం బాధ్యతగా స్వీకరించాలని కళాకారులు కోరుతున్నారు. కళనే నమ్ముకున్న తమకు పింఛన్ ఇవ్వాలని, కళా వేదికలను ప్రభుత్వమే అన్వేషించి ప్రదర్శనలను ఏర్పాటు చేయాలన్నారు. తుని మండలం కొత్తూరులో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యాన ఈ నెల 1న నిర్వహించిన డప్పు కళాకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ డప్పు, చర్మకారుల సంక్షేమం కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళా ప్రదర్శనకు మూడు ఎకరాల భూమి, రూ.ఏడు వేల పింఛన్, ఉచితంగా డప్పు, గజ్జెలు, దుస్తులను మాదిగ కార్పొరేషన్ ద్వారా సమకూర్చాలని డిమాండ్ చేశారు.

కక్ష కట్టి.. కడతేర్చి..

- అత్తమామలను హత్య చేసిన అల్లుడు
- భార్యను కాపురానికి పంపలేదని ఆగ్రహం
- ఘంటావారిగూడెంలో కలకలం

నల్లజర్ల: భార్యను కాపురానికి పంపడం లేదని అత్తమామలపై కక్ష కట్టిన అల్లుడు.. చాకుతో వారిద్దరినీ దారుణంగా పొడిచి చంపాడు. మండలంలోని ఘంటావారిగూడెంలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన ఏకుల బాబూరావు కొన్నేళ్ల కిందట ఘంటావారిగూడేనికి మకాం వచ్చాడు. ఆయనకు భార్య శారద, కుమారుడు అప్పారావు, కుమార్తె నాగేశ్వరి ఉన్నారు. అప్పారావు ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో ఉంటున్నాడు. దెందులూరు మండలం గంగన్నగూడేనికి చెందిన మరీదు కోటేశ్వరరావుతో నాగేశ్వరికి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. బాబూరావు, శారద ఘంటావారిగూడెంలో ప్రధాన రహదారి పక్క చిన్న టీ హోటల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా.. భర్త వేధింపులు భరించలేక ఏడాది క్రితం నాగేశ్వరి తన ఇద్దరు కుమారులు గిరిష్, లోకేష్‌లతో పుట్టింటికి వచ్చి ఉంటోంది. పిల్లలిద్దరినీ స్థానికంగా ఉన్న పాఠశాలలో చదివించుకుంటోంది.

తరచూ గొడవలు

కోటేశ్వరరావు తరచూ ఘంటావారిగూడెం వచ్చి భార్యను కాపురానికి పంపాలని అత్తమామలపై ఒత్తిడి చేస్తూ ఉండేవాడు. ఈ గొడవపై రెండు, మూడుసార్లు పెద్దల సమక్షంలో తగవులు జరిగాయి. అయితే మద్యం తాగి వచ్చి విపరీతంగా కొట్టే భర్త దగ్గరకు కాపురానికి వెళ్లడానికి నాగేశ్వరి నిరాకరించింది. నెల రోజుల క్రితం కోటేశ్వరరావు ఘంటావారిగూడెం వచ్చి బాబూరావుతో ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో మామ పీక నులుముతుండగా స్థానికులు వచ్చి విడదీశారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం హోటల్ పని ముగించుకొని బాబూరావు, శారద, నాగేశ్వరి ఇంటికి వచ్చారు. అదే సమయంలో కోటేశ్వరరావు బైక్‌పై వచ్చి ఆ వీధిలో రెండుసార్లు రౌండ్లు కొట్టాడు. అనంతరం ఇంటి వద్ద ఆగి, మొక్కలను శుభ్రం చేస్తున్న అత్త శారద(48)ను చాకుతో పలుమార్లు పొడిచాడు. ఆ తర్వాత ఇంట్లో నుంచి బయటకు వస్తున్న మామ బాబూరావు(58)ను హతమార్చాడు. ఇది చూసిన నాగేశ్వరి ఇంట్లోకి వెళ్లి దాక్కుని ప్రాణాలు కాపాడుకుంది. అనంతరం కొటేశ్వరరావు బయటకు వస్తూ.. కొంచెం కదులుతున్న శారదను మరోసారి పొడిచాడు. చాకును సంఘటన స్థలంలోనే పాడేసి, తీరుగ్గా సిగరెట్ కాల్చుకుంటూ తన తల్లికి ఫోన్ చేశాడు. అత్తమామలు ఇద్దరినీ చంపేసాను, జైల్లో ఉంటానని చెప్పాడు. పోలీసులు వచ్చే వరకు అతడు అక్కడే ఉన్నాడు. విషయం తెలుసుకున్న సీఐ బాలశౌరి తమ సిబ్బందితో వచ్చి కోటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. అయితే డీఎస్పీ దేవకుమార్ మాత్రం నిందితుడి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, కేసు నమోదు చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్



ఘటనా స్థలంలో బాబూరావు, శారద మృతదేహాలు


హత్యకు వినియోగించిన చాకు


రోదిస్తున్న కుమార్తె నాగేశ్వరి

విద్యుత్ స్మార్ట్ మీటర్ దగ్ధం


నిడదవోలులో కాలిపోయిన స్మార్ట్ మీటర్

నిడదవోలు: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న న్యూ మంజునాథ్ బెంగళూరు అయ్యంగార్ బేకరీలోని విద్యుత్ స్మార్ట్ మీటర్ బుధవారం దగ్ధమైంది. బేకరి యజమానికి ఇష్టం లేకపోయినా విద్యుత్ సిబ్బంది వచ్చి రెండు నెలల క్రితం ఈ మీటర్‌ను బిగించారు. అయితే నాసిరకం మీటర్ ఏర్పాటు చేయడంతో ఈ విధంగా జరిగిందని బాధితుడు చెబుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చిట్టీల సొమ్ము రూ.2 కోట్లతో వ్యక్తి పరార్


తిరుగుడుమెట్టలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, మహిళలు

తాళ్లపూడి: చిట్టీల సొమ్ము రూ.2 కోట్లతో ఓ వ్యక్తి ఉడాయించిన సంఘటన తిరుగుడుమెట్టలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో కిరాణా వ్యాపారం చేసే బెల్లంకొండ సత్యనారాయణ చిట్టీలు వేస్తుంటాడు. అతడి వద్ద గ్రామస్తులు చాలామంది చిట్టీలు కట్టారు. అయితే భార్యతో కలసి సత్యనారాయణ గ్రామం నుంచి పరారయ్యాడు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు బుధవారం అతడి ఇంటి వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ సత్యనారాయణ కొన్నేళ్లుగా చిట్టీలు కట్టించుకుంటున్నాడని, అతడి వద్ద పెద్ద మొత్తంలో వాటిని వేసినట్టు తెలిపారు. చిట్టీ పాట సొమ్మును కూడా తన వద్దే ఉంచుకుని, వడ్డీ ఇస్తానని నమ్మించేవాడన్నారు. అలాగే చాలామంది అతడికి అప్పులు కూడా ఇచ్చామన్నారు. ఇలా సుమారు రూ. 2 కోట్ల వరకూ వసూలు చేశాడన్నారు. కాగా.. బాకీల వాళ్లు వేధిస్తున్నారని, ఆ భయంతో ఊరు వదిలి వెళ్లిపోతున్నట్టు సత్యనారాయణ ఉత్తరం రాసి ఉంచినట్టు సమాచారం. అతడి ఇద్దరు కుమారుల్లో ఒకరు లండన్, మరొకరు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారని చెబుతున్నారు.

బస్సు చక్రాలు ఎక్కడంతో మహిళకు తీవ్ర గాయాలు

- సమయానికి రాని 108
- స్ట్రెచర్‌పై ఆస్పత్రికి తరలింపు
- జగ్గంపేట బస్టాండ్‌లో ఘటన

జగ్గంపేట: బంధువును బస్సు ఎక్కించడానికి వచ్చిన మహిళ ప్రమాదం బారిన పడింది. బస్సు వెనుక చక్రాలు ఎక్కడంతో ఆమె కాలు నుజ్జునుజ్జయ్యింది. జగ్గంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇవి. గోకవరం గ్రామానికి చెందిన రేవాడి రాజేశ్వరి (29) ఇంటికి ఆమె అక్క కుమార్తె అశ్విని తన చంటి పిల్లతో కలిసి కొద్ది రోజుల క్రితం వచ్చింది. తిరిగి తన సొంత ఊరు తుని వెళ్లడానికి బుధవారం సిద్ధమైంది. అయితే అశ్వినిని జగ్గంపేటలో బస్సు ఎక్కించటానికి రాజేశ్వరి కూడా ప్రయాణమైంది. జగ్గంపేట బస్టాండ్‌లో తుని వెళ్లడానికి రాజమహేంద్రవరం నుంచి వచ్చిన బస్సులో అశ్వినిని ఎక్కించి, లగేజీ సర్దిపెట్టింది. ఆ సమయంలో బస్సు కదలడంతో దిగిపోయే ప్రయత్నంలో బస్సు నుంచి కిందకు పడిపోయింది. దీంతో బస్సు వెనుక చక్రాలు ఎక్కడంతో రాజేశ్వరి కుడి కాలు నుజ్జునుజ్జయ్యింది. తీవ్రంగా రక్తస్రావం కావడంతో ఆమెను దగ్గరకు ఎవ్వరూ రాలేదు. స్థానిక శెట్టిబలిజిపేటకు చెందిన శివభక్తుడు పాలిక అప్పారావు ఆమెకు అండగా నిలిచాడు. అలాగే ప్రమాదాన్ని చూసిన అశ్విని వెంటనే బస్సు దిగిపోయింది.

ఎంతకీ రాని అంబులెన్స్

తీవ్రగాయాలతో రోదిస్తున్న రాజేశ్వరిని చూసి బస్టాండ్‌లో ప్రయాణికులు 108కు ఫోన్ చేశారు. కానీ ఎంత సేపటికీ అంబులెన్స్ రాలేదు. దీంతో సుమారు 45 నిమిషాల తర్వాత ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి స్ట్రెచర్ తీసుకువచ్చి చికిత్స కోసం తీసుకువెళ్లసాగారు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు అటుగా వచ్చిన ఓ వ్యాన్‌లో రాజేశ్వరిని ఎక్కించి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం రాజమహేంద్రవరానికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో బాధితురాలి కుటుంబ సభ్యులను ఏలేశ్వరం ఆర్టీసీ డీఎం జీవీ సత్యనారాయణ కలిసి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై పూర్తి వివరాలు అందిన తరువాత కేసు నమోదు చేస్తామని జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు.


ఘటనా స్థలంలో రోదిస్తున్న రాజేశ్వరి


అంబులెన్స్ రాకపోవడంతో స్ట్రెచర్‌పై తరలిస్తున్న స్థానికులు

సీతారామ సత్రాన్ని కూల్చివేయండి

- నివేదిక ఇచ్చిన జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని సత్యనారాయణస్వామి దేవస్థానంలో శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రాన్ని కూల్చివేయాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ల బృందం స్పష్టం చేసింది. ఆ సత్రానికి మరమ్మతులు చేసినా ఉపయోగం ఉండదని తెలిపింది. ప్రొఫెసర్లు వి.రవీంద్ర, జి.ఏసురత్నంతో కూడిన బృందం ఈ నెల 13వ తేదీన సీతారామ సత్రంలోని గదులు, శ్లాబ్, గోడలను పరిశీలించింది. అనంతరం తమ నివేదికను బుధవారం దేవస్థానానికి అందజేసింది. కాగా.. ఆర్‌బీఐ అధికారుల నివేదికను అనుసరించి ఈ సత్రాన్ని కూల్చివేయాలని గతంలోనే నిర్ణయించారు. 2024 మేలో దీన్ని కూల్చివేసి, నూతన సత్రం నిర్మించేందుకు రూ.11.40 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవగా 16 శాతం తక్కువకు ఖరారు చేశారు. అదే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ సత్రాన్ని పరిశీలించిన దేవదాయశాఖ సలహాదారు కొండలరావు దీనికి మరమ్మత్తులు చేస్తే సరిపోతుందని సిఫారసు చేయడంపై గందరగోళం నెలకొంది. దీంతో ఈ సత్రం మరమ్మత్తులు చేయడానికి సుమారు రూ. రెండు కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. దీనిపై జూన్ 26న సాక్షి పత్రికలో 'సత్యదేవ చూడవయ్యా' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఆ వార్తపై కలెక్టర్ షణ్మోహన్, దేవదాయశాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ స్పందించారు. ఈ సత్రాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని జేఎన్‌టీయూ ప్రొఫెసర్లను కోరారు.


సత్రం లోపల గదిని పరిశీలిస్తున్న జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు